TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 37 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శనివారం | మే 16, 2026

## పెట్రో ధరల పెంపు..
## సామాన్యుడి నెత్తిన పిడుగు

- సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర నిర్ణయం సమర్థనీయం కాదు
- ఎన్నికలు ముగియగానే వంచన..
- తక్షణమే ధరలు తగ్గించాలని డిమాండ్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాన్యుల పాలిట పిడుగుపాటు లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమయ్యే ఈ నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్'లో ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుదేలైందని సీఎం విమర్శించారు. పెట్రో ధరల పెంపు ప్రభావం అనేక రంగాలపై వ్యతిరేకంగా పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చెప్తున్న మాటలకు, చేస్తున్న పనులకు అస్సలు పొంతన లేదని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. "ఆత్మనిర్భర్ భారత్ అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప, దేశానికి ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయింది. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఆ పతనం పరాకాష్ఠకు చేరింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయింది" అని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. "ప్రపంచంలోనే భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా చాటుకుంటున్న మోదీ ప్రభుత్వం.. ఇరాన్ – ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సామాన్యుడి నడ్డి విరచడమే. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఎలా సమర్థించుకుంటుంది?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంత ఎన్నికల ప్రచారంలో.. 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచబోం' అని మోదీ ప్రభుత్వం పదే పదే ప్రకటించిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ, ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుకు రూ. 3 పైగా ధరలు పెంచడం ప్రజలను ఘోరంగా వంచించడమేనని మండిపడ్డారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసమే మోదీ అబద్ధాలు చెబుతున్నారని, ఇది ప్రజల పట్ల చేసే విశ్వాసఘాతుకమే అవుతుందని అన్నారు. ప్రజలపై అదనపు భారం మోపుతున్న ఈ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## విదేశీ పర్యటనలపై పన్ను వార్తలు అవాస్తవం

### ప్రధాని మోదీ స్పష్టత

### టీవీ ఛానల్ కథనాన్ని తప్పుబడుతూ ప్రధాని ట్వీట్



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో విదేశీ పర్యటనలపై కేంద్ర ప్రభుత్వం పన్ను లేదా అదనపు సర్‌చార్జ్ విధించేందుకు యోచిస్తోందంటూ వస్తున్న కథనాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ముడుచమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ పతనమవడంతో.. ఆర్థిక ఒత్తిడిని తట్టుకునేందుకు ప్రభుత్వం విదేశీ ప్రయాణాలపై తాత్కాలిక ఆంక్షలు, పన్నులు విధించబోతోందని ప్రముఖ ఆర్థిక వార్తా ఛానల్ 'సీఎన్‌బీసీ' ఒక ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. "ఈ వార్త పూర్తిగా అసత్యం. ఈ కథనంలో ఎలాంటి వాస్తవాలు లేవు. విదేశీ పర్యటనలపై పన్నులు లేదా ఆంక్షలు విధించే ప్రసక్తే లేదు. దేశంలో సులభతర వ్యాపార నిర్వహణ, ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చడానికే మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని తేల్చిచెప్పారు.

( మిగతా వివరాలు 2వ పేజీలో..)

## మహిళల ఆర్థిక స్వావలంబనకు 'స్త్రీనిధి' కొండంత అండ


- మంత్రి సీతక్క
- రూ.24 వేల కోట్ల రుణాల పంపిణీ..
- 32 లక్షల మందికి లబ్ధి
- సమాజ అభివృద్ధికి మహిళల పురోగతే పునాది
- సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదు




## తైవాన్‌పై మాట మార్చిన ట్రంప్

- చైనా పర్యటన తర్వాత వైఖరిలో మార్పు!

**వాషింగ్టన్/బీజింగ్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తైవాన్ దేశ సార్వభౌమాధికారం, భద్రత అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంతకాలం తైవాన్ స్వాతంత్ర్యానికి బాసటగా నిలిచిన అమెరికా వైఖరికి భిన్నంగా.. తైవాన్ అంశం తమకు అత్యంత క్లిష్టమైన సమస్య అని ఆయన పేర్కొన్నారు. భౌగోళికంగా ఆ ప్రాంతం అమెరికాకు చాలా దూరంలో ఉందనే విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా పర్యటన ముగించుకుని వచ్చిన కొద్దిరోజుల్లోనే ట్రంప్ ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓ అంతర్జాతీయ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. భౌగోళిక పరిస్థితులను వివరించారు. "తైవాన్ ద్వీపం చైనా ప్రధాన భూభాగానికి కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉంది. కానీ, అమెరికాకు మాత్రం అది 15 వేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది. అంత సుదూర ప్రాంతం కావడం వల్ల అక్కడ ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే అమెరికా వేగంగా స్పందించడం చాలా కష్టం. చైనా అత్యంత శక్తిమంతమైన, పెద్ద దేశం. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేము యుద్ధం చేయాలని అనుకోవడం లేదు. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల చైనా పర్యటనలో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో జరిగిన భేటీలో.. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే అమెరికా–చైనా మధ్య



తీవ్ర ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు చైనా గట్టిగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వాలను కాపాడటమే ఇరుదేశాల ముందున్న పెద్ద లక్ష్యమని, అమెరికా–చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్ప ప్రత్యర్థులుగా మారకూడదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. తైవాన్‌ను చైనాలో పూర్తిగా విలీనం చేసుకోవాలన్నదే బీజింగ్ వ్యూహం కాగా, తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలని చైనా ఒత్తిడి తెస్తోంది. "తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు" అని ఇంతకాలం జో బైడెన్ యంత్రాంగం సహా అమెరికా అధికారికంగా ప్రకటిస్తూ వచ్చింది. అయితే ట్రంప్ మాత్రం తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పడం గమనార్హం. తైవాన్ రక్షణ విషయంలో అమెరికా వెనకడుగు వేస్తోందనే సంకేతాలు ట్రంప్ వ్యాఖ్యల ద్వారా వ్యక్తమవుతున్నాయని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## లొంగిపోయిన బండి భగీరథ్




- చర్లపల్లి జైలుకు తరలింపు
- నాటకీయ పరిణామాల మధ్య లొంగుబాటు
- ముందస్తు బెయిల్ నిరాకరణ..
- లుకౌట్ నోటీసులు జారీ చేసిన సైబరాబాద్ పోలీసులు
- మేడ్చల్ కోర్టు ద్వారా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శనివారం, మే 16, 2026

# విదేశీ పర్యటనలపై పన్ను వార్తలు అవాస్తవం

## ప్రధాని మోదీ స్పష్టత

**(మొదటి పేజీ తర్వాత..)** ప్రధాని మోదీ స్వయంగా రంగంలోకి దిగి క్లారిటీ ఇవ్వడంతో సదరు వార్తా ఛానల్ తక్షణమే స్పందించింది. తమ కథనంలో కచ్చితత్వం లోపించిందని అంగీకరిస్తూ, ఆ వార్తను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ పొరపాటుకు విచారం వ్యక్తం చేస్తున్నామంటూ 'ఎక్స్' వేదికగా క్షమాపణలు కోరింది. అంతర్జాతీయంగా ఇంధన రంగంలో గడ్డు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం యూఏఈలో జరిపిన పర్యటన విజయవంతమైంది. భారత్‌లో వ్యూహాత్మక పెట్రోలియంనిల్వలను పెంచేందుకు గాను యూఏఈ ప్రభుత్వంతో కేంద్రం ఒక కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరల హెచ్చుతగ్గుల నుంచి రక్షణ పొందడానికి, దేశీయ ఇంధన భద్రతను పటిష్టం చేయడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# నీట్ పేపర్ లీక్ కేసు

## పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషా అరెస్ట్

**పుణె వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమె నీట్ బయాలజీ ప్రశ్నాపత్రం లీక్ కావడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పుణెకు చెందిన మనీషా బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ ప్రక్రియలో స్జబెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆ ప్రశ్నలను నోట్ బుక్‌లో రాసుకోవాలని, టెక్ట్స్ బుక్‌లో మార్క్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు 'స్త్రీనిధి' కొండంత అండ

- మంత్రి సీతక్క
- రూ.24 వేల కోట్ల రుణాల పంపిణీ..
- 32 లక్షల మందికి లబ్ధి
- సమాజ అభివృద్ధికి మహిళల పురోగతే పునాది
- సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదు




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలో మహిళల ఆర్థిక స్వావలంబనకు 'స్త్రీనిధి' సంస్థ కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళలను మైక్రో ఫైనాన్స్ వేధింపుల నుంచి విముక్తులను చేయడమే లక్ష్యంగా ఏర్పాటైన స్త్రీనిధి, నేడు రాష్ట్ర మహిళలకు అత్యంత నమ్మకమైన బ్యాంక్‌గా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగులు తమ హక్కులతో పాటు విధులను కూడా బాధ్యతాయుతంగా గుర్తుంచుకోవాలని సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కలిసికట్టుగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీనిధి సంస్థ సాధించిన ప్రగతిని మంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. "మహిళల కోసమే, మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థ ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలను పంపిణీ చేసింది. తద్వారా 32 లక్షల మంది మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది" అని ఆమె వివరించారు. తెలంగాణ తీసుకొచ్చిన ఈ 'స్త్రీనిధి' మోడల్‌ను ప్రస్తుతం దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా



ఆదర్శంగా తీసుకుని అనుసరిస్తున్నాయని మంత్రి గర్వంగా ప్రకటించారు. "మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి అసలైన పునాది. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధి రంగాలకు మా ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ముఖ్యంగా ఆదివాసీ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం." అని మంత్రి సీతక్క తెలిపారు. మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతున్న స్త్రీనిధి బ్యాంక్‌పై కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణల వల్ల సంస్థ ప్రతిష్టకు భంగం కలగకూడదని ఆమె స్పష్టం చేశారు. "ఎక్కడైనా ఫిర్యాదులు లేదా ఆరోపణలు వస్తే వెంటనే వాటిని వెరిఫై చేసి, నిజానిజాల ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. తన ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగ అనుకూల ప్రభుత్వంగానే ఉంటుందని మంత్రి పునరుద్ఘాటించారు. స్త్రీనిధి ఏర్పాటులో, దాని విజయవంతమైన ప్రస్థానంలో కీలక పాత్ర పోషించిన విద్యాసాగర్ రెడ్డిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# లొంగిపోయిన బండి భగీరథ్..

- చర్లపల్లి జైలుకు తరలింపు
- నాటకీయ పరిణామాల మధ్య లొంగుబాటు
- ముందస్తు బెయిల్ నిరాకరణ..
- లుకౌట్ నోటీసులు జారీ చేసిన సైబరాబాద్ పోలీసులు
- మేడ్చల్ కోర్టు ద్వారా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మైనర్ బాలికపై వేధింపుల ఆరోపణలతో తీవ్రమైన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను శనివారం రాత్రి సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం మేడ్చల్ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, రాత్రి 12 గంటల సమయంలో భగీరథ్‌ను చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నెల 8వ తేదీన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న భగీరథ్ అరెస్టు ప్రక్రియ శనివారం రోజంతా తీవ్ర ఉత్కంఠ రేపింది. ముందస్తు బెయిలు, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఎలాంటి ఉపశమనం లభించకపోవడంతో శనివారం ఉదయం నుంచే ఈ కేసులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందే మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేశారు.

- **లుకౌట్ నోటీసులు.. 5 బృందాలతో గాలింపు**

నిందితుడు విదేశాలకు పారిపోయే అవకాశముందనే బలమైన అనుమానంతో శనివారం ఉదయమే సైబరాబాద్ పోలీసులు భగీరథ్‌పై లుకౌట్ సర్క్యులర్ జారీ చేసి, దేశంలోని అన్ని విమానాశ్రయాలను అప్రమత్తం చేశారు. నిందితుడిని పట్టుకోవడానికి 5 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నిందితుడి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో హైదరాబాద్, కరీంనగర్‌లలోని వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి సైతం పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడల్లోని అతని స్నేహితుల ఇళ్లలో, కరీంనగర్‌లోని భగీరథ్ నివాసంతో పాటు అతని మేనమామ ఇల్లు, బీజేపీ శ్రేణుల ఇళ్లలోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.

- **తండ్రి ప్రకటన.. అప్పా జంక్షన్ వద్ద అదుపులోకి?**



సాయంత్రం వేళ సైబరాబాద్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను ఉన్నతాధికారులు అప్రమత్తం చేయడంతో నిందితుడు లొంగిపోవచ్చుననే ప్రచారం జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. చట్టాన్ని గౌరవిస్తూ తన కుమారుడిని తానే స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే అప్పా జంక్షన్/పోలీస్ అకాడమీ సమీపంలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. రెండు వర్గాల ప్రకటనల అనంతరం, రాత్రి 9 గంటల సమయంలో భగీరథ్ ఇద్దరు న్యాయవాదులతో కలిసి నాలుగు కార్ల కాన్వాయ్‌తో నేరుగా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా స్టేషన్ ముందు పోలీసులు బారికేడ్లు వేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, మేడ్చల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# 'నీట్' పేపర్ లీక్ దారుణం

## పరీక్ష రద్దుతో మనస్తాపం చెంది విద్యార్థి ఆత్మహత్య

**జయపూర్/సికార్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న 'నీట్-యూజీ 2026' పేపర్ లీక్ వ్యవహారం మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. పరీక్ష రాసి భారీ అంచనాలతో ఉన్న విద్యార్థులు, లీకేజీ కారణంగా పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతుండటం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రాజస్థాన్‌కు చెందిన ఓ మెరిట్ విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోవడం కోచింగ్ హబ్‌గా పేరొందిన సికార్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లోని ఝున్‌ఝున్ జిల్లాకు చెందిన ప్రదీప్ మహిచ్ అనే విద్యార్థి, తన సోదరులతో కలిసి సికార్‌లోని ఒక ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. మే 3న జరిగిన నీట్-యూజీ పరీక్షను రాశాడు. పరీక్ష రాసిన అనంతరం 720 మార్కులకు గాను తనకు ఖచ్చితంగా 650 మార్కులు వస్తాయని, ఈ ఏడాది ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు రావడం ఖాయమని తండ్రికి ధీమాగా చెప్పాడు. అయితే, పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దయిందనే వార్త విన్నప్పటి నుంచి ప్రదీప్ తీవ్ర నిరాశలోకి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సికార్‌లోని తన గదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోదరి గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘోర ఉదంతంపై రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మరియు పేపర్ లీక్ ముఠాల స్వార్థం వల్ల అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. నీట్ పరీక్ష రద్దు నేపథ్యంలో కేవలం రాజస్థాన్‌లోనే కాకుండా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ లలోనూ విద్యార్థులు ఆత్మహత్యల బాట పట్టడం దేశ భవిష్యత్తుకే గండమని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శనివారం, మే 16, 2026

# ‘కృత్రిమ మేధ’పై అవగాహన సదస్సు

- కళాశాల ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ

**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల యాక్షన్ ప్లాన్” లో భాగంగా శనివారం అమ్రాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో విద్యా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. వారోత్సవాల ఆరో రోజు సందర్భంగా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు “ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)” అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా ఒక రోజు ప్రాంతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్‌లో ప్రస్తుత ఆధునిక విద్యా విధానంలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత, బోధనా రంగంలో ఏఐ టూల్స్ వినియోగం, సాంకేతిక మార్పులపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.రాధ, ఎ.చంద్రయ్య, ఎన్.మల్లయ్య, డాక్టర్ వై.శ్యాంసుందర్, జి.ఆంజనేయులు, బి.రమేష్, ఎం.శ్రీకాంత్, పి.శంకరయ్య, అధ్యాపకేతర సిబ్బంది సి.రాఘువేందర్ రెడ్డి, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**◆ డిగ్రీ ప్రవేశాలపై ముమ్మర ప్రచారం..**

వెబినార్ అనంతరం కళాశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రక్కనే




ఉన్న పదర మండల కేంద్రంలో దోస్త్ అడ్మిషన్ల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులను కలిసి శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న అత్యాధునిక డిజిటల్ తరగతి గదులు, ల్యాబ్స్, నిపుణులైన అధ్యాపక బృందం మరియు అటానమస్ హోదా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకుని అడ్మిషన్లు పొందాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొంది.

## వేములవాడ మున్సిపల్ కమిషనర్‌గా లోకేష్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ పురపాలక సంఘం (మున్సిపాలిటీ) నూతన కమిషనర్‌గా గ్రూప్–1 అధికారి లోకేష్ శనివారం సాయంత్రం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కమిషనర్ లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో తనకు గ్రూప్–1 అధికారిగా మొదటి పోస్టింగ్ రావడం అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణ సమగ్ర అభివృద్ధికి, స్థానిక ప్రజలతో పాటు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని స్వచ్ఛంగా, ప్రగతి పథంలో ఉంచేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## కామ్రేడ్ మారోజు వీరన్నకు తీన్మార్ మల్లన్న ఘన నివాళి




**సూర్యాపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన అమరవీరుడు కామ్రేడ్ మారోజు వీరన్న 127వ వర్ధంతి వేడుకలు సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని కర్విరాల కొత్తగూడెంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న శనివారం గ్రామంలోని మారోజు వీరన్న స్థూపం వద్దకు చేరుకుని, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, ప్రముఖ న్యాయవాదులు జన్ను పద్మ, కర్రు పావని, స్థానిక నాయకులు, అమరవీరుల బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో వేగంగా మొక్కజొన్న కొనుగోళ్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రూ.241.49 కోట్ల విలువైన దిగుబడి కొనుగోలు

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. బహిరంగ మార్కెట్లో మొక్కజొన్న ధర తక్కువగా ఉన్నప్పటికీ, రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తూ కొనుగోళ్లు జరుపుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటాల్ మొక్కజొన్న ధర సుమారు రూ.1,900 మాత్రమే ఉండగా, ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ క్వింటాల్‌కు ₹2,400 చొప్పున మద్దతు ధర అందిస్తూ సేకరిస్తోందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 19,780 మంది రైతుల నుంచి సుమారు రూ.241.49 కోట్ల విలువైన 1,00,624.15 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను విజయవంతంగా కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొక్కజొన్న నిల్వ సమస్యను అధిగమించేందుకు జిల్లాలో అదనపు గోదాములు, ఓపెన్ క్యాప్ నిల్వ సదుపాయాలను వేగంగా గుర్తిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. “ప్రారంభంలో జిల్లాలో కేవలం 74 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉండేది. కానీ, మొక్కజొన్న భారీగా వస్తుండటంతో గత వారం రోజుల్లోనే యుద్ధప్రాతిపదికన



చర్యలు చేపట్టి, మరో 74 వేల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ స్థలాన్ని సేకరించాం.” అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ సమస్యలు తలెత్తకుండా, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# వీబీజీ గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

- కూలీలకు కనీస వేతనం రూ. 600 చెల్లించాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. దేశానాయక్
- రంగాపూర్‌లో ఉపాధి కూలీల సమస్యలపై సమరభేరి

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి ఉపాధి హామీ పథకంలో తీసుకురాబోతున్న నూతన విధానాలను, విబిజి చట్ట సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. దేశానాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, కూలీలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్. దేశానాయక్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. జూలై నుంచి అమలు చేయ తలపెట్టిన నూతన నిబంధనలను పక్కనపెట్టి, పాత చట్టాన్నే యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రెండు పూటలా ఫోటోలు తీసే (యాప్ ఆధారిత) విధానాన్ని, ఫేస్ రికగ్నిషన్ పద్ధతులను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉపాధి కూలీల ద్రవ్యోల్బణానికి అనుగుణంగా రోజువారీ కనీస వేతనాన్ని రూ. 600లకు పెంచాలి. ప్రతి వ్యక్తికి సంవత్సరంలో కనీసం 210 రోజుల పని కల్పించాలి. ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలి. ఉపాధి సిబ్బందికి



పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలను, కూలీల పెండింగ్ డబ్బులను తక్షణమే విడుదల చేయాలి. తీవ్రమైన ఎండల దృష్ట్యా పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలి. కూలీలందరికీ అవసరమైన పనిముట్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి. “కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వీడి, ఉపాధి కూలీల డిమాండ్లను నెరవేర్చకపోతే.. రాబోయే రోజుల్లో వేలాది మంది కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తాం.” అని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.దేశానాయక్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సైదులు, సీఐటీయూ నాయకులు రాములు, ప్రజా సంఘాల ప్రతినిధులు రాజు, శివ, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్‌తో పాటు ఉపాధి హామీ కూలీలు శంకర్, లక్ష్మి, రాములు, వెంకటమ్మ, లక్ష్మిరెడ్డి, పర్వతాలు, రజిత, సైదమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శని జయంతి ఉత్సవాలు



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చారిత్రిక వరంగల్ నగరంలోని ప్రసిద్ధ శ్రీ రుద్రేశ్వర స్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో శనివారం శని జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ ఆధ్వర్యంలో వైదిక నియమాల ప్రకారం ఈ వేడుకలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నాట్య మండపంలో శనేశ్వర ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి, నువ్వుల నూనెతో ‘శనేశ్వర సూక్తం’ పఠిస్తూ స్వామివారికి శాస్త్రోక్తంగా తైలాభిషేకాలు, నల్ల నువ్వులతో ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని నల్లని వస్త్రములతో శోభాయమానంగా అలంకరించారు. ఈ ఆధ్యాత్మిక వేదికపై ఎస్సార్ యూనివర్సిటీ నుంచి “Redefining cultural identity in select postcolonial narratives” అనే శీర్షికతో ఆధ్యాత్మిక–సాంస్కృతిక రంగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రామగిరి కృష్ణవేణిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా.రామగిరి కృష్ణవేణి శని భగవానుని విశిష్టతను, ఖగోళ ప్రాధాన్యతను వివరిస్తూ భక్తులను చైతన్యపరిచారు. ఈ అద్భుత ఆధ్యాత్మిక వేడుకల్లో ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజితలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

శనివారం, మే 16, 2026

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల యాక్షన్ ప్లాన్" లో భాగంగా శనివారం ఏనుమాముల మార్కెట్ యార్డులో నర్సంపేట నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు 20 రెట్రోఫిటెడ్ మోటార్ వాహనాలు, ఒక మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్ (ఎంపవర్ కార్ట్), ఒక ట్యాబ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2 లక్షల ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని, ఐదేళ్ల లోపు చిన్నారుల లోపాలను సరిచేసేందుకు 'బాల భరోసా' కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టామని వివరించారు. నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండ్యం శ్రీలక్ష్మి రామనాథం మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఈ ఉపకరణాలతో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పరికరాలు అందుతాయని, రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి బి.రాజమణి సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అనిరుద్ యాదవ్, కోఆర్డినేటర్ కార్తీక్, కమిటీ సభ్యులు వీరన్న, చక్రపాణి, రాజు, సతీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి ఐదేళ్ల చిన్నారి మృతి..

- ప్రమాదాన్ని దాచేందుకు సూపర్ వైజర్ ఘాతుకం
- మృతదేహాన్ని సంచిలో కుక్కి బస్సులో తరలించేందుకు యత్నం
- నిలదీసి పట్టుకున్న స్థానికులు..
- పోలీసులకు అప్పగింత

**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఈగలపెంటలో మానవత్వాన్ని నిలువునా పూడ్చివేసే అత్యంత అమానుషమైన ఘటన శనివారం వెలుగుచూసింది. ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి ఓ ఐదేళ్ల చిన్నారి మృతి చెందగా, ఆ విషయాన్ని దాచిపెట్టేందుకు ఓ గెస్ట్ హౌస్ సూపర్వైజర్ సదరు మృతదేహాన్ని సంచిలో కుక్కి బస్సులో తరలించేందుకు ప్రయత్నించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈగలపెంటలోని తెలంగాణ టూరిజం మృగవాని గెస్ట్ హౌస్‌ను ఆనుకొని ఉన్న ఒక పాత భవనంపై ఆరుషి మానిక్ పూరి (5) అనే చిన్నారి ఆడుకుంటూ నిద్రిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడిపోయింది. తీవ్ర గాయాలవ్వడంతో ఆ చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అయితే, ఈ ప్రమాదం బయటకు తెలిస్తే గెస్ట్ హౌస్ యాజమాన్యానికి ఎక్కడ ఇబ్బంది వస్తుందోననే నెపంతో అక్కడ పనిచేసే ఒక సూపర్వైజర్ అత్యంత దారుణంగా వ్యవహరించాడు. చిన్నారి చనిపోయిందనే కనీస జాలి, మానవత్వం లేకుండా ప్రమాదాన్ని దాచేందుకు సూపర్వైజర్ ఆ మృతదేహాన్ని ఒక ప్లాస్టిక్ సంచిలో కుక్కాడు. ఆ సంచిని వేరే ప్రాంతానికి తరలించేందుకు స్థానిక ఈగలపెంట బస్టాండ్‌కు తీసుకువచ్చాడు. అయితే, తీవ్రమైన ఎండలో సంచిని పట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్న అతని ప్రవర్తనను గమనించిన స్థానికులు గట్టిగా నిలదీశారు. అతను పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం



వచ్చి సంచిని బలవంతంగా తెరిచి చూడగా, అందులో చిన్నారి మృతదేహం లభ్యమవడంతో అందరూ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. సూపర్వైజర్ చేసిన ఘాతుకాన్ని గ్రహించిన స్థానికులు తక్షణమే అతడిని పట్టుకుని బంధించారు. అనంతరం అమ్రాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడైన సూపర్వైజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**కరీమాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కరీమాబాద్‌లోని శ్రీ పద్మశాలి పొదుపు పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్, వరంగల్ మెడివిజన్ మల్లికార్జున లేజర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మెడివిజన్ కంటి ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఆర్ఈసీ ప్రధాన రహదారి వెంట నిర్మించనున్న కల్వర్టు, సైడ్ డ్రైనేజీ పనులతో పాటు, రాజాజీనగర్ నాలా బ్రిడ్జి పూడికతీత పనులను ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాకాలంలో నగరంలో వరద ప్రభావం ఎక్కువగా ఉండే వర్షాభావ/ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే పది రోజుల్లో నాలాల పూడికతీత పనులను పూర్తి చేసి, వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. ఇప్పటికే అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైనేజీ నిర్మాణం, జంక్షన్ల సుందరీకరణ పనుల కోసం రూ. 24 కోట్ల నిధులు కేటాయించామని, అతి త్వరలోనే వీటికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ రోడ్డు విస్తరణ పనులను పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. "గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ స్వలాభాల వల్లే నగరంలో వరదలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు రాకుండా మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళికల ప్రకారం శాశ్వత పరిష్కారాలు చూపుతాం." అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు అశోక్ జంక్షన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ (KU) వరకు రోడ్డు పరిస్థితులను కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు సులభంగా రాకపోకలు సాగించేలా బస్ స్టాండ్ నుంచి కాంగ్రెస్ భవన్ రోడ్డు మీదుగా కేయూ రోడ్డుకు అనుసంధానం చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు విస్తరణ వల్ల ఎవరైనా నష్టపోతే వారికి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, డీఈలు సారంగపాణి, గోపి, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యా, వైద్య రంగాల్లో 'కృత్రిమ మేధ' కీలక పాత్ర

- కేయూ రీజినల్ స్థాయి ఏఐ కాన్‌క్లేవ్-2026లో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం
- పీజీ పాఠ్యప్రణాళికలో 'ఏఐ' అంశాల చేర్పు
- ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి
- వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణకు డీప్ లెర్నింగ్ విధానాలు ఎంతో అవసరం





**హనుమకొండ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రస్తుత ఆధునిక కాలంలో విద్యా, వైద్య రంగాలలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ –ఏఐ) అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – విద్యా వారోత్సవాల" సందర్భంగా.. కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సెనెట్ హాల్‌లో విభాగ అధిపతి డాక్టర్ బి. రమ అధ్యక్షతన "రీజినల్ స్థాయి ఏఐ కాన్ క్లేవ్ –2026" నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు విద్యా, వైద్యం, వ్యవసాయం, పాలనా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో వ్యాధుల నిరారణకు సీఎన్ఎన్, ఆర్ఎన్ఎన్, ఎల్ఎస్టీఎమ్ వంటి డీప్ లెర్నింగ్ విధానాలు ఎంతో కీలకంగా మారాయని వివరించారు. సాంకేతికత ఎంత పెరిగినా.. ఏఐ వినియోగంలో నైతికత, పారదర్శకత, సామాజిక బాధ్యతలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిశోధకులు, విద్యార్థులు గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేలా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న నిట్ వరంగల్ ఆచార్యులు డా.రామలింగస్వామి చెరకు "ప్రగతిశీల తెలంగాణ కోసం విద్య, ఆవిష్కరణలు, పరిశోధన రంగాల భవిష్యత్తును మలచడంలో కృత్రిమ మేధస్సు పాత్ర" అనే అంశంపై ప్రసంగించారు. ఏఐ అనేది అధ్యాపకులకు ప్రత్యామ్నాయం కాదని, బోధనను మరింత సమర్థవంతం చేసే ఒక శక్తివంతమైన సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు. పూర్వం కంప్యూటర్ల ప్రవేశ సమయంలోనూ ఇలాంటి అనుమానాలే వచ్చాయని, కానీ ఆ తర్వాత అవే లక్షలాది ఉద్యోగాలకు కారణమయ్యాయని గుర్తుచేశారు. వైద్యరంగంలో వ్యాధి విశ్లేషణకు ఏఐ తోడ్పడినా, తుది నిర్ణయం మాత్రం 'మానవ మేధస్సు'దేనని ఆయన స్పష్టం చేశారు. "కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో విస్తృత ఉద్యోగావకాశాలను సృష్టించనుంది. కొత్త సాంకేతికత ప్రారంభ దశలో కొంత అసౌకర్యం సహజం. ప్రతి విద్యారంగంలోనూ ఏఐ టూల్స్ వినియోగంపై విద్యార్థులు, అధ్యాపకులు నైపుణ్యాలు పెంచుకోవాలి." అని కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ బి.రమ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ పాఠ్యప్రణాళికలోని ప్రతి సబ్జెక్టులోనూ ఏఐ అంశాలను చేర్చేలా ముసాయిదా రూపకల్పన జరుగుతోందని కీలక ప్రకటన చేశారు. కృత్రిమ మేధస్సులోని అవకాశాలు, సవాళ్లను సమానంగా స్వీకరిస్తూ సృజనాత్మకంగా ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న అభ్యర్థులు, పరిశోధకులు ఏఐ సాంకేతికతపై తమకున్న పలు సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు ఆచార్య ఎన్. రమణ, ఆచార్య భిక్షాలు, వివిధ అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.